# ఆర్‌సిబి పేసర్ల జోరుతో ఢిల్లీ ధమాల్



### 6.3 ఓవర్లకే ముగిసిన మ్యాచ్ !

ఆఖరి ఓవర్ థ్రిల్లర్లు, ఉత్కంఠ పోరాటాలతో ఆరంజుగా సాగుతున్న ఐపిఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సంచలన విజయం సాధించింది. ఏకపక్ష మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై భారీ తేడాతో గెలుపొందింది. పవర్ ప్లేలోనే భువనేశ్వర్(3–5), హేజిల్వుడ్(4–12) మూడేసి వికెట్లతో విరుచుకుపడగా.. ఢిల్లీని 75కే ఆలౌట్ చేసిన ఆర్సీబీ స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. దేవ్దత్ పడిక్కల్(34 నాటౌట్), విరాట్ కోహ్లీ(23 నాటౌట్)లు దంచేయగా భారీ విజయంతో రన్‌రేటు మెరుగుపరచుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అరుణ్ జైట్లీ స్టేడియంలో పంజా విసిరింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లతో బోర్ కొట్టిన అభిమానులకు బౌలర్ల సత్తాను చూపిస్తూ భారీ విజయం మూటగట్టుకుంది. హిట్టర్లతో నిండిన ఢిల్లీ క్యాపిటల్స్‌ను 75లకే ఆలౌట్ చేసి సగం విజయం సాధించిన ఆర్సీబీ మ్యాచ్‌ను 6.3 ఓవర్లలోనే ముగించింది. సొంతగడ్డపై చతికిలపడిన ఢిల్లీ ఐదో ఓటమి చవిచూసింది.

**పడిక్కల్ ధనాధన్...** ఇంప్యాక్ట్ సబ్ జాకబ్ బెథెల్(20)ను మూడో ఓవర్లోనే నటరాజన్ స్టన్నింగ్ క్యాచ్తో వెనక్కి పంపినా దేవ్దత్ పడిక్కల్(34 నాటౌట్), విరాట్ కోహ్లీ(23 నాటౌట్) దంచేశారు. జేమీసన్ ఓవర్లో పడిక్కల్ 6, 4, 6 తో స్కోర్ 60కి చేరింది. నటరాజ్ వేసిన 7వ ఓవర్లో కోహ్లీ వరసగా రెండు సిక్సర్లు బాదడంతో ఆర్సీబీ 9 వికెట్ల తేడాతో గెలుపొందింది.

**భువి, హేజిల్వుడ్ ధాటికి...** పంతొమ్మిదో సీజన్లో సంచలనం నమోదైంది. గత మ్యాచ్‌లో 264 పరుగుల స్కోర్ కొట్టిన ఢిల్లీ క్యాపిటల్స్ ఈసారి అనూహ్యంగా 75కే కుప్పకూలింది. పవర్‌ప్లేలోనే ఆర్సీబీ పేసర్లు భువనేశ్వర్(3–5),హేజిల్వుడ్(4–12) వికెట్ల వేటతో ఢిల్లీ బ్యాటర్లు సున్నాలు చుట్టేశారు. బంతిని స్వింగ్ చేస్తూ ఇద్దరూ వికెట్ల పండుగ చేసుకోగా 8 పరుగులకే ఆరు వికెట్లు పడ్డాయి. ఇన్నింగ్స్ తొలి ఓవర్లో మొదటి బంతికే అరంగేట్రం కుర్రాడు సహిల్ పరాఖ్(0)కు భువనేశ్వర్ యార్కర్తో బౌల్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లో హేజిల్వుడ్ మొదటి రెండుబంతుల్లో కేఎల్ రాహుల్(1), సమీర్ రిజ్వీ(0)లను ఔట్ చేశాడు. ట్రిస్టన్ స్టబ్స్(5) వికెట్ కాపాడుకున్నా భువనేశ్వర్‌కు దొరికిపోయాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే అక్షర్ పటేల్(0)ను భువి ఔట్ చేసి ఢిల్లీని భయపెట్టాడు. నేనేమన్నా తక్కువా అన్నట్టు ఆ తర్వాతి ఓవర్లోనే నితీశ్ రానా(1)ను హేజిల్వుడ్ వెనక్కి పంపాడు. అంతే.. 8పరుగులకే ఆరో వికెట్ పడింది. బెంగళూరు పేసర్ల విజృంభణ చూశాక ఐపీఎల్ చరిత్రలో ఆర్సీబీ పేరిటున్న అత్యల్ప స్కోర్‌ను ఢిల్లీ బ్రేక్ చేస్తుందనిపించింది. కానీ, డేవిడ్ మిల్లర్(19), ఇంప్యాక్ట్ సబ్ అభిషేక్ పొరెల్(30) పట్టుదలగా ఆడారు. వీరిద్దరు వికెట్ కాచుకోవడంతో పవర్ ప్లేలో ఢిల్లీ 6వికెట్ల నష్టానికి 13పరుగులు చేసింది. ఓపికగాఆడుతున్న మిల్లర్, పొరెల్ జోడీని విడదీసిన రసిక్ దార్ సలాం ఢిల్లీని ఆలౌట్ అంచున నిలిపాడు. కుల్దీప్ అండతో జట్టు స్కోర్ 70 దాటించాడు పొరెల్. కానీ, 17వ ఓవర్ మూడో బంతిని హేజిల్వుడ్ సంధించిన యార్కర్కు అతడు బౌల్డయ్యాడు. దాంతో, 75పరుగులకే ఢిల్లీ ఇన్నింగ్స్‌కు తెరపడింది.

# ఉబెర్ కప్ నుంచి భారత బృందం ఔట్..!

ఎన్నో ఆశలతో డెన్మార్క్‌కు వెళ్లిన భారత బృందం ఉబెర్ కప్ నుంచి నిష్క్రమించింది. ఒలింపిక్ విజేత పివి సింధు ఓటమితో టీమిండియా అనూహ్యంగా ఇంటి దారి పట్టింది. గ్రూప్ ఏ మ్యాచ్‌లో చైనా షట్లర్ వాంగ్ ఝియూ ధాటికి సింధు చేతులెత్తేసింది. డబుల్స్‌లో ప్రియా కొంజెంగ్బమ్ శృతి మిశ్రా ద్వయాన్ని చైనా జంట లీ షెంగ్ షూ టాన్ నింగ్ చిత్తు చేసింది. ఇషారాణి బరౌహ్, దేవికా సిహగ్ ఓటమితో భారత జట్టు టోర్నీ నుంచి వైదొలిగింది. మహిళా షట్లర్ల వైఫల్యంతో ఉబెర్ కప్ నుంచి ఇంటిదారి పట్టింది. తొలుత సింగిల్స్లో పీవీ సింధు పోరాడినా చైనా గోడను దాటలేకపోయింది. మ్యాచ్ ఆరంభంలో 47తో వాంగ్ ఝియూ జోరుతో వెనకబడిన సింధు దూకుడుగా ఆడి 9–9తో స్కోర్ సమం చేసిం నెట్ వద్ద బలమైన షాట్లు ఆడుతూ.. వరసగా ఐదు పాయింట్ గెలిచి 11–9తో పైచేయి సాధించింది.

కానీ, స్కోర్లు 16–16 ఉన్నప్పుడు తెలివిగా ఆడిన చైనా షట్లర్ 21–16తో సెట్‌ను గెలుచుకుంది. రెండో సెట్‌లో పుంజుకున్న సింధు ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా 21–19తో విజయం సాధించింది. కానీ, నిర్ణయాత్మక మూడో సెట్‌లో వాంగ్ నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. చివరకు 19–21తో భారత స్టార్ వెనకబడింది.

### దేవికా ఓటమితో ...

అసలే సింధు ఓటమితో డీలా పడిన భారత్‌ను డబుల్స్‌లో ప్రియా కొంజెంగ్బమ్ శృతి మిశ్రా ద్వయం, సింగిల్స్‌లో ఇషారాణి బరౌహ్ పరాజయం నిష్క్రమణకు దారి తీసింది. తనీషా క్రాస్టో కవిప్రియ సెల్వం సైతం కంగుతిన్నారు. వీరిని



ఝూంగ్ షుక్జిన్, లుయో గ్జుమిన్ జంట 2110, 21–19, 19–21తో మట్టికరిపించింది. దేవికా సిహగ్ను గ్జు వెన్జింగ్ ఓడించడంతో ఉబెర్ కప్లో భారత జట్టు పోరాటం ముగిసింది.

## మహిళ

# స్వయం ఉపాధి దిశగా..

భారతదేశంలో మహిళల స్వయం ఉపాధి గత కొన్ని సంవత్సరాల్లో గణనీయమైన మార్పును సూచించే సామాజిక, ఆర్థిక పరిణామంగా ఎదుగుతోంది. సంప్రదాయంగా కుటుంబ బాధ్యతలకు పరిమితమైన మహిళలు ఇప్పుడు ఆర్థిక కార్యకలాపాల్లో స్వతంత్ర పాత్రను పోషిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వాములుగా మారుతున్నారు. ఈ మార్పును ఉపాధి గణాంకాలకు మాత్రమే సంబంధించిన అంశంగా కాకుండా, మహిళల ఆర్థిక స్వావలంబన, కుటుంబ నిర్ణయాధికారంలో పెరుగుదల, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణానికి సంకేతంగా కూడా చూడాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు చిన్న స్థాయి వ్యాపారాలు ప్రారంభించడం ద్వారా కుటుంబ ఆదాయానికి తోడ్పడటమే కాకుండా స్థానిక ఉపాధిఅవకాశాలను కూడా సృష్టిస్తున్నారు. సాంప్రదాయ ఉద్యోగ అవకాశాలు పరిమితంగా ఉండటం, అనధికార రంగంలో ఉపాధి ఎక్కువగా ఉండటం వంటి పరిస్థితులు మహిళలను స్వయం ఉపాధి వైపు మళ్లించాయి. ఇంటి వద్ద నుంచే పని చేయగలగడం, కుటుంబ బాధ్యతలతో పాటు ఆదాయం సంపాదించగలగడం మహిళలకు ఈ మార్గాన్ని ఆకర్షణీయంగా మార్చింది. అదనంగా మొబైల్ ఫోన్ విని



యోగం, డిజిటల్ చెల్లింపులు మరియు ఆన్‌లైన్ మార్కెట్లు చిన్న వ్యాపారాలకు కొత్త అవకాశాలను తెరిచాయి. మహిళల స్వయం ఉపాధి పెరుగుదలలో ప్రభుత్వ పథకాల పాత్ర అత్యంత కీలకం. ముఖ్యంగా ముద్ర యోజన పథకం మహిళా పారిశ్రామికవేత్తలకు గణనీయమైన ఆర్థిక సహకారాన్ని అందించింది. ఈ పథకం ద్వారా వ్యవసాయేతర చిన్న వ్యాపారాలకు పూచీకత్తు లేకుండా రూ.10 లక్షల వరకు రుణాలు అందుబాటులోకి రావడం వల్ల అనేక మహిళలు చిన్న పరిశ్రమలు, సేవా రంగ వ్యాపారాలు ప్రారంభించగలిగారు. కుట్టు కేంద్రాలు, హస్తకళలు, బ్యూటీ పార్లర్లు, మరమ్మతు సేవలు వంటి వ్యాపారాలు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో వేగంగా పెరిగాయి. దీనదయాళ్ అంత్యోదయ యోజన – జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం)

మహిళల ఆర్థిక సాధికారతకు మరో ముఖ్యమైన పునాది. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు పొదుపు అలవాటు పెంచుకుని, సమూహంగా వ్యాపార కార్యకలాపాలు చేపట్టే అవకాశాన్ని పొందారు. లక్షపతి దీదీ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలను స్థిర ఆదాయం కలిగిన వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది. ఈ విధానం మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా సామాజిక గుర్తింపును కూడా కల్పిస్తోంది. స్టార్టప్ ఇండియా కార్యక్రమం ద్వారా మహిళలు నూతన ఆలోచనల ఆధారంగా వ్యాపారాలను ప్రారంభించడానికి అనుకూల వాతావరణం ఏర్పడింది. స్వయంఉపాధిలో మహిళలు ప్రధానంగా సూక్ష్మ, చిన్న వ్యాపార రంగాలపై దృష్టి సారిస్తున్నారు. హస్తకళలు, కుట్టు, ఆహారపదార్థాల తయారీ, చిన్న రిటైల్ వ్యాపారాలు, గృహ ఆధారిత సేవలు వంటి రంగాలు మహిళలకు సులభంగా ప్రవేశించగలిగే అవకాశాలను అందిస్తున్నాయి. ఈ రంగాలు తక్కువ పెట్టుబడితో ప్రారంభించగలగడం, స్థానిక మార్కెట్‌పై ఆధారపడడం వల్ల ప్రమాదం తక్కువగా ఉంటుంది. అలాగే డిజిటల్ వేదికల ద్వారా ఇంటినుంచే వ్యాపారాలు నిర్వహించే మహిళల సంఖ్య పెరుగుతోంది. సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్పత్తులను విక్రయించడం, ఆన్‌లైన్ ఆర్డర్లు స్వీకరించడం వంటి మార్పులు చిన్న వ్యాపారాలను విస్తృత మార్కెట్‌కు తీసుకెళ్లా యి. ఈ పరిణామం గ్రామీణ ఉత్పత్తులను జాతీయస్థాయికి తీసుకెళ్లడంలో కీలకంగా మారింది. కుటుంబ ఆదాయాన్ని నిలబెట్టడంలో మహిళల పాత్ర పెరుగుతుంది.

అనేకానేక రంగాల్లో వృద్ధి కనిపిస్తున్నప్పటికీ, మహిళలు అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. సామాజిక పరిమితులు, కుటుంబ బాధ్యతలు ఇప్పటికీ పెద్ద సవాళ్లుగానే ఉన్నాయి. వ్యాపారం నిర్వహించడానికి అవసరమైన సమయం, ప్రయాణం, మార్కెట్ సంబంధాలు ఏర్పరచుకోవడం వంటి అంశాలు కొంత మంది మహిళలకు కష్టంగా మారుతున్నాయి. ఆర్థిక సహాయం అందుబాటులో ఉన్నప్పటికీ మూలధనం పొందడం ఇంకా పూర్తిగా సులభం కాలేదు. బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన లేకపోవడం, పత్రాల ప్రక్రియ క్లిష్టత, క్రెడిట్ చరిత్ర లేకపోవడం వంటి కారణాలు రుణాల పొందడాన్ని ప్రభావితం చేస్తున్నాయి. వ్యాపారాన్ని విస్తరించడంలో నిర్వహణ నైపుణ్యాల కొరత కూడా ఒక ముఖ్యమైన సమస్యగా పరిశోధనలు సూచిస్తున్నాయి. కార్మికులను నిర్వహించడం, మార్కెట్ విస్తరణ, లాభనష్టాల విశ్లేషణ వంటి అంశాల్లో శిక్షణ అవసరం ఉంది. కొన్ని అధ్యయనాలు స్వయం ఉపాధి పెరుగుతున్నప్పటికీ మహిళల నిజమైన ఆదాయం కొన్ని సందర్భాల్లో తగ్గిందని సూచిస్తున్నాయి. అంటే వ్యాపారం ఉన్నప్పటికీ లాభదాయకత స్థిరంగా ఉండకపోవడం ఒక వాస్తవం. ఇది మార్కెట్ పోటీ, ధరల మార్పులు, మధ్యవర్తుల ఆధిపత్యంతో సంబంధం కలిగి ఉంటుంది. స్వయంఉపాధి మహిళలకు మద్దతు అందించడంలో పలు స్వచ్ఛంద సంస్థలు కూడా కీలకపాత్ర పోషిస్తున్నా



యి. స్వయంఉపాధి మహిళల సంఘం వంటి సంస్థలు అనధికారరంగ మహిళా కార్మికులకు గుర్తింపు, శిక్షణ, హక్కుల పరిరక్షణ అందించడానికి పనిచేస్తున్నాయి. ఈసంస్థలు మహిళల పనికి సామాజిక విలువను పెంచడం ద్వారా వారి ఆర్థికస్థితిని బలోపేతం చేస్తున్నాయి. భారత ప్రభుత్వం మహిళా ఆధారిత అభివృద్ధిని ప్రోత్సహించేందుకు బడ్జెట్ కేటాయింపులను గణనీయంగా పెంచింది. మహిళల వ్యాపారాలకు మద్దతు ఇవ్వడానికి కేంద్రస్థాయిలోనే డెబ్బైకి పైగా పథకాలు అమల్లో ఉన్నాయి. భవిష్యత్తులో శిక్షణ, డిజిటల్ సాధనాలు, ఆర్థికచేర్పు, మార్కెట్ అనుసంధానం ప్రధాన దృష్టిగా మారుతున్నాయి. డిజిటల్ విద్య, ఆన్‌లైన్ మార్కెట్ యాక్సెస్ పెరగడం వల్ల మహిళల వ్యాపారాలు స్థానిక స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి విస్తరించే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా చూస్తే మహిళల స్వయం ఉపాధి పెరుగుదల ఒక సామాజిక మార్పు సూచికగా నిలుస్తోంది. ఇదిమహిళల వ్యక్తిగత ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంచడమే కాకుండా కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోంది. సవాళ్లు కొనసాగుతున్నప్పటికీ సరైన విధాన మద్దతు, శిక్షణ, మార్కెట్ అవకాశాలు పెరిగితే స్వయం ఉపాధి మహిళలకు స్థిరమైన జీవనోపాధిగా మారే సామర్థ్యం కలిగి ఉంది. మహిళలు ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్న ఈ మార్పు దేశ ఆర్థిక భవిష్యత్తును ప్రభావితం చేసే ముఖ్యమైన దిశగా పరిగణించవచ్చు.

## సమస్యల పరిష్కారానికి
# మహిళలు ఉద్యమించాలి

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చైతన్యవంతంతో ఉద్యమించాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సిపిఐ గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దండి సురేష్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు మహిళలకు ప్రత్యేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన పాలకులు వాటిని విస్మరించారన్నారు. మహిళల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఆపడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాలన్నారు. మహిళా బిల్లు అమలులో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. మే 16న వైరాలో జరిగే రాష్ట్ర మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా 22వ మహాసభలను విజయవంతం చేయాలని దండి సురేష్ కోరారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, తాటి నిర్మల, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే హక్కుల రక్షణ

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** పోరాటాలతోనే హక్కుల రక్షణ సాధ్యమని, మేడే స్ఫూర్తితో హక్కుల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల సమావేశం ఇందిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. ప్రపంచ కార్మికులకు పండుగ రోజైన మే 1న మేడే ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని, వాడవాడలో కార్మికుల అడ్డాల వద్ద ఎర్రజెండాలు ఎగురవేసి ర్యాలీలు ప్రదర్శనలో పాల్గొన్నాలని కోరారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలు, నాలుగు కోడ్‌లుగా విభజించి చట్టం చేసిందని, మేడే స్ఫూర్తితో అన్ని కార్మిక సంఘాలు ఏకమై తమ హక్కుల కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెట్టి ప్రసాద్, ఎలక్ట్రికల్ యూనియన్ పట్టణ కార్యదర్శి దగ్గుబాటి సత్యానందం, సివిల్ సప్లై యూనియన్ మేస్త్రీ బెల్లంకొండ రామ్మూర్తి, రామిశెట్టి సుబ్బారావు, పంకజ్, రమేష్, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పాలనలో
# హరిస్తున్న కార్మిక హక్కులు

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశంలో మోదీ పాలనలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయని, హక్కుల పరిరక్షణకు పోరాటమే మార్గమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సిపిఐ నగర సమితి సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ మునుపెన్నడు లేని రీతిలో కార్మిక వర్గంపై దాడి జరుగుతుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించిందన్నారు. కార్మికులకు నష్టం కలిగిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికులు ఉద్యమించాలన్నారు. మేడే స్ఫూర్తితో పోరాటాలు సాగించాలని తెలిపారు. మేడే కేవలం వేడుక మాత్రమే కాదని కార్మికుల పోరాట స్ఫూర్తికి, హక్కుల సాధనకు ప్రతీక అని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో కార్మిక చైతన్యాన్ని చాటిచెప్పేలా మేడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మేడే సందర్భంగా మే ఒకటిన శుక్రవారం ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ వద్ద సభ జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. మేడే వేడుకల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, రాష్ట్ర సమితి సభ్యురాలు ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, తాటి వెంకటేశ్వర్లు, సిహెచ్ సీతామలక్ష్మి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, తాటి నిర్మల, గాదె లక్ష్మినారాయణ, మోహన్‌రావు, జాకీర్, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న
# మోదీ ప్రభుత్వం

ఎఐటియుసి జనగామ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్

**ప్రజాపక్షం/జనగామ :** కేంద్రంలో మోదీ ప్రభుత్వ తీసుకొచ్చిన కొత్త లేబర్ కోడ్‌లతో కార్మికులకు కష్టాలు తప్పవని ఎఐటియుసి జనగామ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా సమితి సమావేశం చామకూర యాకూబ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కుల్ని హరిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని, 42 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని పూర్తిగా ప్రైయివేట్ పరం చేస్తుందన్నారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, హమాలీ, బీడి, ఆటో, ఆర్‌టిసి కార్మికులు జిల్లా వ్యాప్తంగా మేడే సందర్భంగా ఎర్రజెండాలను ఎగరవేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు గుడెల్లి రాజు, లింగాల రాములు, గోలకొండ నాగరాజు, మరికుక్కల సాయిలు, రావుల సదానందం, మోటే సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.



# నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మేడే వేడుకలు జరుపుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్ పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన మేడే పోస్టర్స్ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మేడే వేడుకలు జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్,బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు ఎం.ఎ.గౌస్, పూసాల రమేశ్, అటికేటి రాజు, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**హనుమకొండ టౌన్ :** ఎఐటియుసి ఆధ్వర్యంలో మేడే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో ఎఐటియుసి హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్, జిల్లా నాయకులు దర్మల రాంమూర్తి, ఏల్పుల ధర్మరాజు, లంక దాసరి అశోక్ , రీల్ పూర్ణచందర్, దామెర రాజు, తాటిపెళ్లి రవీందర్‌రెడ్డి, కుమార్‌స్వామి పాల్గొన్నారు.



**మహబూబాబాద్:** పపంచ కార్మిక దినోత్సవం మేడేను ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ పిలుపునిచ్చారు. మంగళవారం మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెలుగు శ్రావణ్, చింతకుంట్ల వెంకన్న, మంద శంకర్, కేదాసు రమేష్, ఎండి మహమూద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్ :** మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్ట్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి, వారిని తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వనస్థలిపురంలోని డీజీఎస్ మహేశ్వరం జనరల్ ఆసుపత్రిలో మెడికల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు దాసరి కిరణ్ ఆధ్వర్యంలో మేడే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు గోల్కొండ నాగరాజు, పటేటి శేఖర్, భాగ్యమ్మ, శ్యామల, స్టాలిన్, లావణ్య, పద్మ, సునిత, శారద, పద్మ, ప్రభావతి, సుబ్బాని, రవి, రాజు, సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.







# నిప్పుల కొలిమిగా నిజామాబాద్

దంచి కొడుతున్న ఎండలు
ఆదివారం 44.3 ఉష్ణోగ్రత
సోమవారం రికార్డుస్థాయిలో 46
జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు






**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలో ఎండలు దంచి కొడుతున్నాయి. భానుడి భగభగతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 9 గంటలకు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. నిజామాబాద్‌తో సహా పలు ప్రాంతాల్లో 44 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం జిల్లాలోని మెండోరా మండలంలో 46 డిగ్రీలు రాష్ట్రంలోనే అత్యధిక రికార్డు నెలకొన్నది. మంగళవారం ఉదయం 11గంటలకు 44.7గా నమోదు కావటం విశేషం. జిల్లాలో ఉదయం 11 గంటలకే రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వడ గాల్పుల తాకిడి మరింతగా పెరిగింది. పగటి పూట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్న సందర్భంగా ప్రజలు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవటం మంచిదని, పలు జాగ్రత్తలు అవసరమని వైద్యులు చెబుతున్నారు. గాలిలో తేమ శాతం సైతం 28 వరకు నమోదు కావటంతో పరిస్థితిని అర్థంచేసుకోవచ్చు. 3040 కిలోమీటర్ ఫర్ అవర్ ఈదురుగాలులు వీస్తుండటంతో పిడుగులు పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రభావం వ్యవసాయరంగం, విమానయానంపై పడే అవకాశాలున్నాయని రైతులు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈసారి ఎక్కువగా ఉన్నాయని, ఆదివారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యాయి. హీట్‌వేవ్స్ ఉన్న సందర్భంగా ప్రజలు వైద్యారోగ్యాధికారులు, డాక్టర్లు ఇచ్చిన సూచనలు తప్పక పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలా ఎక్కువ రోజులు హీట్‌వేవ్స్ ఉండటం, వర్షాలు పడకపోవటంతో ఎక్కువగా ఉక్కపోత ఉంటుందని, మధ్యాహ్నం సమయంలో ప్రజలు ఎండలో తిరగవద్దని బాలచందర్ వాతావరణ సైంటిఫిక్ అసిస్టెంట్ సూచిస్తున్నారు. రానున్న సీజన్‌లో మామూలుగా పడే వర్షాలకన్నా తక్కువ పడే అవకాశాలున్నాయన్నారు. సోమవారం 44.7 జిల్లా కేంద్రంలో ఉండగా మండలాల్లో 46 వరకు ఉష్ణోగ్రత నమోదవ్వటం విశేషం. రానున్న రెండు మూడు రోజులు మరింత ఉష్ణోగ్రత పెరిగే అవకాశం లేకపోలేదని, అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచిస్తుంది.

**ఉష్ణోగ్రత వివరాలు :** గత సంవత్సరంతో పోల్చుకుంటే ఆదివారం ఎక్కువగా ఉష్ణోగ్రత 44.3గా నమోదైంది. ఇదే ఎక్కువగా నమోదు కావడమేమని చెబుతున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలో 40.4గా నమోదు కాగా, మెండోరాలో 46గా నమోదు కావడం విశేషం. గత వారం రోజులుగా వాతావరణంలో మార్పులు గమనించినట్లయితే ఏప్రిల్ 22న 41.4, 23న 41.08, 24న 42.5, 25న 42.2, 26న 43.1, 27న 44.7, 28న 44.8 గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేలో 46 డిగ్రీ ల నుంచి 47 వరకు పెరిగే అవకాశముంది. సాయంత్రం సమయంలో వర్షాలు పడాలి కానీ పడటం లేదని అందుకే ఇంతలా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు.



## లబ్ధిదారులకు రెండు పడకల గదులు

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్లు అందించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో గల రెండు పడక గదుల ఇండ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశ్యంతో చేపట్టిన రెండు పడక గదుల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## రైతులకు నాణ్యమైన మందులు, ఎరువులు అందించాలి

**ప్రజాపక్షం/తలమడుగు :** మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో పెస్టిసైడ్స్, ఎరువుల డీలర్లతో మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి, ఎస్సై రాధిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన పురుగు మందులు, ఎరువులు అందించాలని తెలిపారు. నిషిద్ధ పురుగు మందులను విక్రయించినా, మహారాష్ట్ర నుండి పురుగు మందులు, ఎరువులను తీసుకొచ్చి అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని, ఎక్కడైనా కల్తీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రభాకర్, ఝరి ప్రాథమిక వ్యవసాయ కేంద్రం సీఈఓ రాజు, పెస్టిసైడ్స్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



## సోయం బాపురావుకు జన్మదిన శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/మావల :** రాష్ట్ర మాజీ పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, రాజ్‌గోండు సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావుకు ఆదిలాబాద్ నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్‌రావు, మాజీ డిసిసిబి అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, డేరా కృష్ణారెడ్డి, నరేష్‌రెడ్డి, ఎంఎ ఖయ్యూమ్, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే పెళ్లి రోజు సందర్భంగా మంచిర్యాలలో సేవా కార్యక్రమాలు

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల సురేఖ ప్రేంసాగర్‌రావు దంపతుల 40వ వివాహ వేడుకలను మంగళవారం మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేటర్ తూముల నరేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే మంచిర్యాల నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చడానికి కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్టు ద్వారా వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని బస్టాండ్, ఐబి చౌరస్తా, మార్కెట్ ఏరియా, హమాలివాడ, సిసిసి కార్నర్, హమాలివాడ, శ్రీరాంపూర్ ఏరియాలలో ఉచిత మంచినీరు, అంబలి పంపిణీ కార్యక్రమాలను ఆయా కార్పోరేటర్లు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మునిస్పల్ కార్పోరేషన్‌లోని కార్పోరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ఎల్‌ఒసి చెక్కులు అందజేత

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సదాశివపేట మండలం సురారం గ్రామానికి చెందిన ఆదీన్ పర్జాన్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌స్‌లో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కృషితో రూ. 85 వేల ఎల్‌ఓసి మంజూరైంది అదే విధంగా సురారం గ్రామానికి చెందిన మహమ్మద్ అయాన్ ఆతీష్,కూడా అనార్యోగంతో అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన వైద్య ఖర్చుల కోసం రూ. 75 వేల ఎల్‌ఓసి మంజూరు చేయించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు, చింత ప్రభాకర్, మాణిక్‌రావు, బాదిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసి చెక్కులను అందజేశారు. ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు అండగా నిలుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు.




## పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పెట్రోల్, డీజిల్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలుగకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులును ఆదేశించారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై సంబందిత అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా జిల్లా ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి, కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పెట్రోల్ బంకుల వివరాలు, రోజువారిగా పెట్రోల్, డీజిల్ అమ్మకాల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు తప్పనిసరిగా వచ్చిన స్టాక్, అమ్మిన స్టాక్, మిగిలిన స్టాక్ వివరాలు డైలీ స్టాక్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఎవరికి కూడా అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ ఇవ్వరాదన్నారు. భైంసా సబ్ కలెక్టక్, ఎఎస్పీ లు అజ్మీరా సంకేత్ కుమార్, సాయి కిరణ్, ఆర్డీ రత్నకళ్యాణి, పౌరసరఫరాల అధికారి రాజెందర్, డి.ఎం.హెచ్.ఓ. రాజేందర్, బిసి ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, అంబాజీ మోహన్ సింగ్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డిపిఆర్ఒ విష్ణువర్ధన్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**పరీక్షల్లో అనుత్తీర్ణులు అయిన విద్యార్థులు నిరాశ చెందొద్దు**

ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఎట్టి పరిస్థితిలోను నిరాశ చెందకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం సోఫీ నగర్ కెజిబివిలో ఇంటర్ పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిభిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, మండల విద్యాధికారి సిద్ది పద్మ, కెజిబివి ప్రత్యేక అధికారి సుజాత, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.



## కొందరు ఐపిఎస్‌లు మా ఫోన్లు హ్యాక్ చేస్తున్నారు

మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** బిఆర్ఎస్ అగ్ర నాయకులతో పాటు ఇతర ఎమ్మెల్యేల పోన్లను, వారి ఇంటి ముందు ఉన్న సిసి కెమెరాలను ప్రైవేట్ హ్యాకర్ల ద్వారా కొందరు ఐపిఎస్ అధికారులు హ్యాక్ చేస్తున్నారని బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. మంగళవారం కంది మండల కేంద్రంలో గల సెంట్రల్ జైలులో ఉన్న బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావులతో కలిసి జైలులో పరామర్శించారు. అనంతరం మీడియాలో మాట్లాడుతూ కొందరు ఐపిఎస్ అధికారులు బెంగుళూరు నుంచి తీసుకువచ్చిన ప్రైవేటు హ్యాకర్స్ ద్వారా తమ ఫోన్‌లను ఇంటి ముందు గల సిసి కెమెరాలు హ్యాక్ చేయిస్తున్నారని ఆరోపణలు చేశారు. రాబోయేది తమ ప్రభుత్వమేనని ఆ ఐపిఎస్ అదికారులు రిటైర్ట్ అయినా వదిలిపెట్టమని హెచ్చరించారు. విచారణ జరిపిస్తామని, స్వంత ఖర్చులతో కోర్టు చుట్టూ తిరగాల్సి ఉంటుందని హెచ్చరించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరాచక పాలన కొనసాగిస్తుందని ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు.



## ఆన్‌లైన్ ద్వారా జనగణన నమోదుచేసుకున్న కలెక్టర్

**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుండి జనగణన డిజిటల్ నమోదు కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కలెక్టరేట్ ఛాంబర్ లో సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానంలో స్వయంగా తన వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా స్వయంగా వివరాలు నమోదు చేసుకోవడం వల్ల ప్రజల సమయం ఆదా అవుతుందని, ఈ అవకాశన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. మే 11వ తేదీ నుండి ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఆ సమయంలో ముందుగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసిన వారు నమోదు సమయంలో పొందిన ఐడి నంబర్ తెలియచేయాలని సూచించారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసిన ప్రతి ఒక్కరూ ఐడి నంబర్‌ను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని తెలిపారు. జిల్లా ప్రజలు అందరూ బాధ్యతతో పాల్గొని జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.



## మహిళా సర్పంచ్ ను అవమానపరిచిన సొసైటీ అధికారులపై చర్యలకు డిమాండ్

ప్రజావాణిలో సర్పంచ్ పద్మ ఫిర్యాదు

**ప్రజాపక్షం/పాపన్నపేట :** వరి కొనుగోలు కేంద్రం ప్రారంభంలో సొసైటీ అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని కొత్తపల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 25న కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ప్రారంభించే నేపథ్యంలో స్థానిక కొత్తపల్లి సర్పంచ్ పద్మ జగన్నాథంకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకొని సర్పంచుకు అవమానపరిచే విధంగా వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత వైపు అడుగులు వేస్తూ మహిళలకు ప్రాధాన్యత ఇస్తుంటే కొత్తపల్లి సొసైటీ అధికారులు ఏకంగా మహిళా సర్పంచ్ కు అవమానపరిచారు అంటే వారి పనితనానికి నిదర్శనం అన్నారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు మరల పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత సొసైటీ అధికారులపై చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. సర్పంచ్ వెంట రైతు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు తాడేపు సోములు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి, మాజీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు జగన్, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, శ్రీనాథ్ రావు, స్రవంతి శ్రీనివాస్, నర్సింలు గౌడ్, కొత్తపల్లి ఉప సర్పంచ్ రాము, నాయకులు, రామకృష్ణ, దుర్గా దాస్, కృష్ణ ఉన్నారు.

## పింఛను కోసం దివ్యాంగురాలి ఎదురుచూపు

పలుమార్లు దరఖాస్తు చేసినా పింఛను మాత్రం రాలే!



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** అన్ని అర్హతలతో పాటు సంబంధిత అన్ని ధృవపత్రాలున్నా పింఛను మంజూరు కవడం లేదని, ప్రభుత్వం దయ చూపాలంటూ ఓ దివ్యాంగురాలు వేడుకుంటుంది.

ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన జ్యోతి అలియాస్ చోప్పకట్ల రాజమణి 65 గత కొన్ని సంవత్సరాల కిందట ప్రమాదానికి గురికాగా నడుముకు బలమైన గాయం కావడంతో నడిచే వీలులేక వీల్‌చైర్, మంచానికే పరిమితం అయింది. శాశ్వత వికలాంగత్వం పొందిన బాధితురాలు పింఛను కోసం మొదట సధరంకు ధరఖాస్తు చేసుకోగా 90 శాతం వికలాంగత్వం ఉన్నట్లు సదరం ధృవపత్రం జారీ సైతం అయింది. దాంతో పించను కోసం జిల్లా కలక్టర్ ప్రజావాణి, సంబంధిత కార్యాలయాల్లో పలుమార్లు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది అయినను ప్రభుత్వం నుంచి పింఛను మంజూరు కాకపోవడంతో ఆర్థిక సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యలకు మందులకే ఎంతో వ్యయమవుతుందని దీంతో శారీరక , మానసిక ఆరోగ్యం క్షీస్తుందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఆరుపదుల వయసు దాటిన కనీసం ప్రభుత్వం నుండి ఆసరా పింఛను దివ్యాంగుల కోటాలో పింఛను ఏది మంజూరు కావడం లేదంటూ వాపోంతి. కుటుంబం దీనస్థితి, నడిచే పరిస్థితి లేని తనకు ప్రభుత్వం దివ్యాంగ పించను మంజూరు చేస్తే చేదోడు వాదోడుగా ఉంటుందని తన ఆవేదనను వ్యక్తం చేస్తోంది.



## ధాన్యంకొనుగోలు కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :** ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణలో నిర్లక్షయంపై కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల అలసత్వం వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ భీమ్‌గల్ మండల ఐకెపి ఎపియంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. మండలంలోని పల్లికొండ, భీమ్‌గల్ గ్రామాల్లో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించి లోటుపాట్లు నెలకొని ఉండటాన్ని గమనించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయకపోవటం, రిజిస్ట్రర్ అందుబాటులో లేకపోవటం వంటి లోపాలను గుర్తించిన కలెక్టర్ కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెదక్‌యాప్ ఆధారంగా వాతావరణ పరిస్థితులపై ముందస్తుగానే రైతులకు వివరాలు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేయాలన్నారు. ట్రక్‌షీట్లను వెంటాదివెంట తెప్పించుకుంటూ ట్యాబ్ ఎంట్రీలను వేగంగా జరిపించాలని, తద్వారా సకాలంలో రైతుల ఖాతాలలో బిల్లులు జమవుతాయన్నారు. తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ నిర్వహణ తీరుతెన్నులను పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, సివిల్ సప్లయి డీయం ప్రవీన్, డీసీఓ శ్రీనివాస్, అధికారులున్నారు.




## కమ్యూనిస్టుల త్యాగాలు వెలకట్టలేనివి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కమ్యూనిస్టుల త్యాగాలు వెల కట్టలేనివని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. మంగళవారం నగరంలోని న్యూఅంబేడ్కర్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు అమరజీవి కా।। నూర్జహాన్ సంతాప సభనుద్దేశించి సుధాకర్ మాట్లాడారు. ప్రతి మనిషి పుట్టుక మరణం తప్పదని ఈ మధ్యకాలంలో చేసిన సేవలే గుర్తుండిపోతాయన్నారు. అమరజీవి నూర్జహాన్ సిపిఎంలో చేరిన తర్వాత నగరంలో జరిగిన గుడిసెల పోరాటంలో చంటి బిడ్డను ఎత్తుకుని తాను వేయించిన పేదల గుడిసెలకు వెన్నుదన్నుగా ఉంటూ వర్షాన్ని, ఎండనూ లెక్క చేయకుండా పేదల పోరాటానికి అండగా ఉన్నారన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు శ్రామిక మహిళల కోసం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా సిపిఎం రాష్ట్ర నాయకులుగా ఎదిగి ప్రజాసేవకు అంకితమయ్యారని కమ్యూనిస్ట్ పార్టీ కార్యకర్తల సేవలు అమోఘమని వాటిని వెలకట్టలేమని ఆపరేషన్ కగార్ పేరుతో అడవిలోని ఖనిజ సంపదను కార్పోరేట్ శక్తులకు అప్పనంగా అప్పజెప్పడం కోసం మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. బిజెపి పాలనకు వ్యతిరేకంగా మాట్లాడితే వారిని అర్బన్ నక్సలైట్స్ అని, దేశ ద్రోహులని అనడం దుర్మార్గమన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

జిపిపి డిపో వద్ద కార్మికుల సంబురాలు
హాజరైన డిసిసి అధ్యక్షుడు
తూంకుంట అంక్షారెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆర్టీసి కార్మికులకు సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చినట్లు సిద్దిపేట డిసిసి అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని జిపిపి డిపో వద్ద కార్మికులు సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఆందోళన చేసిన ఆర్టీసీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరగగా, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి వెంటనే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, జూన్ 2 వ తేదీన విలీన ప్రకటన చేస్తామని ప్రకటించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నట్లు గుర్తు చేశారు. అంతేకాకుండా ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలకు అంగీకారం తెలపడంతో పాటు 10 శాతం ఫిట్మెంట్ ఇవ్వడానికి సన్నద్ధత ప్రకటించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఆర్టీసీ కార్మికుల 31 డిమాండ్లలో 28 డిమాండ్లకు ఏకకాలంలో పరిష్కారం లభించగా, కార్మికుల కుటుంబాల నుండి సంతోషం వ్యక్తమవుతోందని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పెద్దిరెడ్డి, అశోక్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు షరీఫ్, పట్టణ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు మొనగారి రాజు, రాములు గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, నేతలు జహీర్, గుంటూకు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, యాదగిరి, మహేష్ యాదవ్, అశోక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం గజ్వేల్ మండల పరిధిలోని కొల్గూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ జ్యోతి స్వామితో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సరైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అయితే రైతులు సైతం నిబంధనల మేరకు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించాలని కోరారు. కాగా సన్నధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ. 500 బోనస్ ధాన్యం డబ్బులతో కలిపి జమ చేయాలని పేర్కొన్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తే ఇబ్బందులు ఉండవని, లేనిపక్షంలో అన్నదాతలు దళారులను ఆశ్రయించి నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. కేసీఆర్ చొరవ ఫలితంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పుష్కలమైన పంటలు పండుతున్నట్లు వివరించారు.

